సాగరతీరం.. కోలాహలం

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కిట కిటలాడింది. ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. సముద్ర స్నానాలు చేసి సేదతీరారు. చిన్నారులు ఇసుక తెన్నెలపై, ఒడ్డుకొస్తున్న కెరటాల్లో ఆడుకున్నారు. ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

సమర శంఖం..

- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అంగన్‌వాడీలు సమాయత్తం
- బడ్జెట్లో కోతలు.. అమలకు నోచుకుని హామీలు
- నేడు, రేపు కలెక్టరేట్ల వద్ద 36 గంటల నిరవధిక ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అంగన్‌వాడీలు సమరశంఖం పూరించారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సమాయత్తమయ్యారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు చూసిచూసి కడుపు తరుక్కుపోయిన అంగన్‌వాడీలు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపేందుకు శ్రీకారం చుట్టారు. 36 గంటలపాటు నిరవధిక ధర్నా చేపట్టేందుకు పూనుకున్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టబోయే నిరసనలో వేలమంది అంగన్‌వాడీలు భాగస్వాములయ్యేందుకు సమాయత్తమయ్యారు.

గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామీణ ప్రజానీకానికి ఎన్నో సేవలందిస్తున్నాయి. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు చిన్నారుల ఆలనా పాలనా చూసి వారి బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్యనందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. అయితే ఈ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కీలక రంగంలో మెరుగైన సేవలందిస్తున్న అంగన్‌వాడీలు అనేకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. జిల్లాలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 70, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 1500 వరకూ ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఆయాలు, టీచర్లు కలిపి సుమారు 3 వేల మంది వరకూ పనిచేస్తున్నారు. అయితే ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగ భద్రత నుంచి గ్రాడ్యూటీ వరకూ అనేక సమస్యలతో వారు సావాసం చేస్తున్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పింఛను, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యూటీ అమలు చేయడంతో పాటు ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10వ తేదీన కోర్కెల దినం పురస్కరించుకుని పోరాటాన్ని ఉధృతం చేయాలని అఖిల భారత కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లాలో అంగన్‌వాడీలు 36 గంటల పాటు నిరవధిక ధర్నా చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సుమారు 2 వేల మందిపైబడి అంగన్‌వాడీలు ధర్నాలో భాగస్వాములయ్యేందుకు సమాయత్తమయ్యారు.

ప్రకటనలకే పరిమితం..

అంగన్‌వాడీల సమస్యల పట్ల యూనియన్ ఆధ్వర్యంలో అనేక రూపాల్లో దశలవారీ పోరాటాలు చేయడం జరిగింది. ఈ పోరాటాల ఫలితంగా 2018లో అంగన్‌వాడీ వర్కర్లకు రూ.1500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1,250 వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం ప్రకటించింది. అయితే నేటికీ హామీ ప్రకటనకే పరిమితమైంది. ఇదిలా ఉంటే 2017 నుంచి ఇప్పటివరకూ టిఎ బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించలేదు.

ఐసిడిఎస్ లక్ష్యానికి కేంద్రం తూట్లు

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్ లక్ష్యానికి తూట్లు పొడుస్తోంది. అధికారం చేపట్టి తొమ్మిదేళ్లయినా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తోంది. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చి అమలు చేస్తోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. అయితే పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు నయా పైసా కూడా పెంచిన దాఖల్లాలేవు. 2022 ఏప్రిల్‌లో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీలు 1972 చట్టం ప్రకారం గ్రాడ్యూటీకి అర్హులని చెప్పినప్పటికీ అమలు కావడం లేదు. ఇలాఉంటే లబ్ధిదారులను కుదించడానికి పోషణ ట్రాక్ యాప్ తీసుకొచ్చారు. ప్రయివేటీకరణ విధానలు అమలు చేస్తూనే రకరకాల యాప్‌లు తీసుకొచ్చి విపరీతంగా పనిభారం పెంచింది. 2023-24 గాను ప్రవేశపెట్టిన బడ్జెట్ సైతం తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లతో పాటు స్కీం వర్కర్లకు ఈ బడ్జెట్ ప్రయోజనం చేకూర్చలేదు.

అమలు కానీ ముఖ్యమంత్రి జగన్ హామీ

మాట ఇచ్చాక మడమ తిప్పనని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ నీటి మూటలు గానే మిగిలిపోయింది. తెలంగాణా కంటే అదనంగా వేతనాలిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదు. నవరత్నాల పేరుతో నూటికి 98 శాతం హామీలు అమలు చేశామని చెబుతున్నా ప్రభుత్వం అంగన్‌వాడీల హామీ ఎందుకు నెరవేర్చలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

డిమాండ్లు ఇవే..

- అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి. వేతనంలో సగం పింఛను ఇవ్వాలి.
- అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
- .హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలి. ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలి.
- 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లతో సమానంగా వేతనాలివ్వాలి. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి.
- వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలి.
- వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలి. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలి.
- సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, బీమా అమలు చేయాలి.
- లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలి. ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలి.
- సీనియార్టీ ప్రకారం వేతనాలివ్వాలి, సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం..

డి.కళ్యాణి,
అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

అంగన్‌వాడీలు నేడు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఉద్యోగ భద్రత లేదు. గ్రాడ్యూటీ అమలు జరగడం లేదు. వేతనాల పెంపు ఊసే లేదు. టిఎ బిల్లులు అందించడం లేదు. రిటైర్డ్ బెనిఫిట్స్ లేవు. పెన్షన్ లేదు. ఇలా అనేక సమస్యలున్నాయి. పని ఒత్తడి, రాజకీయ వేధింపులతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తాం.

టిసిల జారీలో ఇబ్బందులు పెడితే చర్యలు

ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కళాశాల యాజమాన్యాలు డబ్బులు అడిగినా, ఇతర ఇబ్బందులకు గురిచేసినా తనకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఎలా సాగుతుంది.. కనీస సౌకర్యాలు లేని కళాశాలలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు తదితర ప్రశ్నలకు ప్రజాశక్తి 'ముఖాముఖి'లో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో ఏ ఏ యాజమాన్యాల పరిధిలో ఎన్ని ఇంటర్ కళాశాలలు ఉన్నాయి?

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 34, ప్రయివేటు కళాశాలలు 170, ఎయిడెడ్ కళాశాలలు 5, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు 9, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలు 3, కస్తూర్బా బాలిక విద్యాలయాలు 3, ఇతర యాజమాన్యాలతో కలిపి మొత్తం 273 కళాశాలలు ఉన్నాయి.

ప్రశ్న: ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఎలా సాగుతుంది? ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారా? అడ్మిషన్లు పెంచేందుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా?

ప్రభుత్వ కళాశాలల్లో ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 714 అడ్మిషన్లు జరిగాయి. ఒక రకంగా చెప్పాలంటే ఇది తక్కువే అని చెప్పొచ్చు. విద్యార్థులు ఎక్కువగా ప్రయివేట్ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఆయా కళాశాలల పరిధిలో ప్రచారం చేయటం, విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుంది.

ప్రశ్న. ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి అదనపు తరగతులు నిర్వహించటం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, ప్రత్యేక శిక్షణ, క్రమం తప్పకుండా క్లాసులకు హాజరయ్యేలా చూడటం, ఎవరైనా క్లాసులకు సరిగ్గా హాజరు కాకపోతే విద్యా వాలంటీర్ల ద్వారా వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలకు హాజరయ్యేలా చేయడం వంటి చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: ప్రయివేట్ కళాశాలల్లో అధిక ఫీజుల వసూలుపై విద్యార్థులు గగ్గోలు పెట్టడమే కాకుండా విద్యార్థి సంఘాలు కూడా అనేక పోరాటాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫీజుల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రయివేట్ కళాశాలల్లో ఫీజులపై ప్రత్యేక నిబంధనలు లేవు. కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజులు తల్లిదండ్రులకు ఇష్టమై కడుతున్నారు. దీనిపై ప్రభుత్వం నిబంధనలు తీసుకొస్తే మేం అమలు చేస్తాం.

ప్రశ్న: ప్రయివేట్ కళాశాలల్లో ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నిబంధన ప్రకారం బదిలీ సర్టిఫికెట్లు పొందేందుకు యాజమాన్యాలకు ఎలాంటి సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తే విద్యార్థులు నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఉమ్మడి జిల్లాలో అనుమతులు లేని కళాశాలలుగాని, కనీస సౌకర్యాలు లేని కళాశాలలుగాని ఎన్ని గుర్తించారు? రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తున్నారా? ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జిల్లాలో ఇప్పటివరకు 57 కళాశాలలపై తనిఖీలు నిర్వహించాం. అనుమతులు లేని రెండు కళాశాలలు గుర్తించాం. అలాగే వీటిలో కొన్నింటికి అనుమతులు ఉంటే మరికొన్నింటికి అనుమతులు లేని పరిస్థితులు ఉన్నాయి. ఆ వివరాలన్నీ ఇంటర్మీడియట్ బోర్డుకు పంపించాం. బోర్డు నుంచి ఆ కళాశాలకు నోటీసులు పంపి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

ప్రశ్న: ఇంటర్ కళాశాలల్లో చదివే అర్హులైన విద్యార్థులందరికీ అమ్మఒడి వస్తుందా?

ఈ విషయంలో సరైన సమాచారం లేదు. కళాశాలల నుంచి సమాచారం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రశ్న: ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నాడు-నేడు కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మరుగుదొడ్లు, తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్స్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇప్పటికే చాలా కళాశాలల్లో నిర్మాణ దశలో ఉన్నాయి. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు నాడు-నేడు ద్వారా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

చిన్నరైల్వే స్టేషన్ల రద్దు అన్యాయం - ప్రతి ఎకరాకూ పూర్తిస్థాయిలో సాగు నీరందించాలి - సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ధరలు విపరీతంగా పెరుగుతున్నా అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ జిల్లాలో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరగడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధరలను తక్షణం నియంత్రించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కూడా తగ్గించాలన్నారు. జిల్లాలో చిన్న రైల్వే స్టేషన్లను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. దేశంలో రైల్వే వ్యవస్థ సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఇప్పటికే కొన్ని ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం ప్రజలకు అన్యాయం చేయడమేనన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య తక్షణం పెంచాలన్నారు. పై తరగతుల ఛార్జీలను తగ్గించి, దిగువస్థాయి తరగతుల ఛార్జీలను తగ్గించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రైల్వేస్టేషన్లు, రైళ్ల రద్దును తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. జిల్లాలో రైతులకు సాగునీరు అందేలా చూడాలని, ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనుల బకాయిలను వెంటనే చెల్లించి, కూలి పెంచాలన్నారు. అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని, సన్న, చిన్నకారు రైతులకు రుణాలిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కాలంలో దళితులు, మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయనిచ వాటిని అరికట్టాలని అన్నారు. జిల్లాలో అనేక మండలాల్లో దళితపేటల్లో శ్మశాన వాటికలు లేవన్నారు. జిల్లా అధికారులు తక్షణం ప్రతి దళితపేటకూ రెండెకరాలు శ్మశాన వాటికను కేటాయించాలని కోరారు. యలమంచిలి మండలంలో చించినాడలో పెరుగులంక భూములను పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమస్యల్లో పేదలు, దళితులు, బలహీన వర్గాలపై అక్రమంగా పెట్టిన కేసులను తక్షణం ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొనే అన్ని సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నేతలు చింతకాయల బాబూరావు, కవురు పెద్దిరాజు, పివి.ప్రతాప్, డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలేవీ

అనారోగ్యంతో 300 మంది పడిపోతే ఏళ్లు గడుస్తున్నా కానరాని రిపోర్టు
జ్యుట్‌మిల్లు మూతపడి పది వేల మంది ఉపాధి కోల్పోతే పట్టించుకోరా
విషతుల్యంగా మారుతున్న కొల్లేరును రక్షించుకోవాలి
ఏలూరు పర్యటనలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

జగన్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని, ప్రభుత్వాసుపత్రులను చిదిమేస్తుందని, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లుగాని, యంత్రాలుగాని ఏ ఒక్కటీ లేకపోవడంతో ప్రజలకు వైద్యసదుపాయాలు అందకుండా పోయాయని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. వారాహి రెండోవిడత యాత్రను ఆయన ఆదివారం ఏలూరు నుంచి ప్రారంభించారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు పవన్ కలపర్రు టోల్‌గేట్ వద్దకు చేరుకోగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జనసైనికులు ఘనస్వాగతం పలికారు. యువత బైక్‌ర్యాలీతో ముందుకుసాగగా మినీ బైపాస్‌లోని క్రాంతి కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం 6.20 గంటలకు కల్యాణ మండపం నుంచి పాత్‌బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ సభలో పవన్ మాట్లాడుతూ మద్యనిషేధం అని చెప్పి అత్యధికంగా రూ.లక్షా 25 వేల కోట్లు ఆదాయం రాబట్టిందని విమర్శించారు. దీనిలో రూ.30 వేల కోట్లు లెక్కలు లేవన్నారు. జంగారెడ్డిగూడెంలో 32 మంది కల్తీసారా తాగి చనిపోయారన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్రానికి రూ.250 కోట్లు ఇచ్చిందని, అందులో రూ.15 కోట్లు ఖర్చుచేస్తే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించవచ్చునన్నారు. ఆసుపత్రుల్లో టాబ్లెట్‌లు కూడా అందించలేని పరిస్థితి ఉందన్నారు. ఏలూరులో 300 మందికిపైగా తల తిరిగి అనారోగ్య సమస్యతో పడిపోతే ఇప్పటికీ దానిపై రిపోర్టు లేదన్నారు. డిగ్రీ కాలేజీకి భవనం లేకుండా పోయిందని, రూ.80 కోట్లతో ప్రతిపాదనలున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏలూరులో 500 టన్నుల నిమ్మ పంట కొనుగోళ్లు జరుగుతాయని ఇక్కడ కోల్డ్ స్టోరేజ్‌గానీ, సరైన ధర అందించే ప్రక్రియగానీ లేకుండాపోయిందన్నారు. జ్యూట్‌మిల్లు మూతపడినా పట్టించుకోవడం లేదన్నారు. కొల్లేరు సరస్సును కాపాడుకుని పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నారు. అనాథ శవాలకు దహన సంస్కారాలు చేసే ఫ్లాష్ టీంను చిదిమేశారన్నారు. అభివృద్ధి జరగాలన్నా, అరాచకం పోవాలన్నా ఈ ప్రభుత్వం మారాలన్నారు. ఐదు గంటలకు ప్రారంభం కావాల్సిన సభ 8 గంటల వరకూ ప్రారంభం కాకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ఉభయగోదావరి జిల్లాల్లో 34 సీట్లలో వైసిపిని గెలిపించాలి
చీఫ్ విప్ ప్రసాదరాజు



ఉండి నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రత్యర్థి రాజకీయ పార్టీలు జగన్‌పై కక్షగట్టి దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రజల మేలు కోసం సిఎం జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకెళ్లాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పెదఅమిరంలో పివిఎల్.నరసింహారాజు ఆధ్వర్యంలో నిర్మించిన వైసిపి ఉండి నియోజకవర్గ నూతన కార్యాలయంలో పలు విభాగాలను ప్రసాదరాజు, వైసిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్, టిటిడి మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, జిల్లా మహిళా మండలి అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల ప్రారంభించారు. అనంతరం నూతన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాదరాజు మాట్లాడుతూ జగన్ పాలనపై దుష్ప్రచారం చేస్తున్నారని, వీటన్నింటినీ ఎదుర్కోవాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని అన్నారు. ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని బి సంవత్సరాలుగా ఉండి నియోజకవర్గంలో పివిఎల్ నరసింహారాజు ఆధ్వర్యంలో నాలుగేళ్లలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేశారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. భవిష్యత్తులో ఉండి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి వైసిపి జెండాను ఎగరవేస్తామన్నారు. భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ వారాహి యాత్ర చేస్తున్న జనసేన అధినేత ఉభయ గోదావరి జిల్లాల్లో 34 అసెంబ్లీ సీట్లలో ఒక్కటి కూడా వైసిపిని గెలవనీయను అంటున్నాడని, అయితే 34 సీట్లు గెలుపొంది సత్తా చాటుతామని స్పష్టం చేశారు. డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు మాట్లాడుతూ అన్ని రంగాల్లో పాలనా వ్యవస్థను పటిష్టం చేసి, పేదల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం నిరంతరం కషి చేస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేలా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేంద్ర వెంకటస్వామి, ఎంపిపిలు పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, భూపతిరాజు చంటిరాజు, ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కఠారి జయలక్ష్మి కేశవ, జెడ్‌పిటిసిలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, యండగండి శ్రీను, రణస్థల కనకదుర్గ మహంకాళి, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొరపాటి అనిత, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, కోపల్లె ,కలవపూడి సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పి.దుర్గాప్రసాదరాజు, సాగిరాజు హరి వర్మ, నేతలు గాదిరాజు సుబ్బరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నటకే భాష్యం చెప్పిన నటుడు గుమ్మడి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నటనకే భాష్యం చెప్పిన ఉత్తమ నటులు గుమ్మడి వెంకటేశ్వరరావు అని శోభన్‌బాబు ఫ్యాన్స్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో పట్టణ కళాకారుల ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటులు గుమ్మడి వెంకటేశ్వరరావు జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుమ్మడికి భీమవరంలో సత్సంబంధాలు ఉన్నాయని, తన తండ్రి మధుసూదన్‌రావు, ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్ కార్యదర్శికి గుమ్మడి సన్నిహితులని తెలిపారు. చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు చుక్కనశ్రీ మాట్లాడుతూ సహజ నటనతో ప్రేక్షకుల హృదయాల్లో గుమ్మడి నిలిచిపోయారన్నారు. పట్టణ కళాకారుల సంఘం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గుమ్మడి భీమవరంలో 5 దశాబ్దాల క్రితం గన్నాబత్తుల పెదతాత ఇంటికి వచ్చారని, కుటుంబ కథా చిత్రాలతో తనకంటూ ప్రత్యేక స్థానం సంతరించుకున్న గుమ్మడి యుగాంతం వరకూ నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.శిరీష, ఎండి సరోజినీ, ఉండపల్లి రమేష్ నాయుడు, కె.పూర్ణమ్మ పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



పాలా ప్రసాద్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పాలా ప్రసాద్ (52) అనారోగ్యంతో భీమవరం ఆస్పత్రిలో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఇటీవల కాలంలో ప్రసాద్ లివర్ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. భీమవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం వేంద్ర. ఆయన మృతికి ఎస్ఐ బి.సురేంద్రకుమార్, సిబ్బంది సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం : ఎంఎల్ఎ

ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం - ఉండి రోడ్డులో ఆర్ఎన్ ఆక్వా ఇండస్ట్రీస్ బ్లూ ఓషెన్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌ను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. అత్యాధునిక టెక్నాలజీతో ఐఎస్ఐ స్టాండర్డ్‌తో శుద్ధిచేసిన నీటిని అందించడం అభినందనీయమని తెలిపారు. భీమవరంలోనే నూతన టెక్నాలజీతో అతిపెద్ద ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం విశేషమని తెలిపారు. ప్రొఫెసర్ పామర్తి నారాయణరావు మాట్లాడుతూ ఈ ప్లాంట్‌లో ప్రత్యేకంగా ల్యాబ్ టెస్టింగ్ చేసినంతరం ప్యాకింగ్ చేసి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, కామన నాగేశ్వరరావు, సిరి ఆక్వా సోల్యూషన్స్ గణేషన్ కుమార్ పాల్గొన్నారు.



ముగింపు సభకు హాజరైన వక్తలు

అల్లూరి పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - పాలకొల్లు

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. పాలకొల్లు అద్దేపల్లి వారి సత్రం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన అల్లూరి 125వ జయంత్యుత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజన పోరాటంలో ఆయన ప్రాణత్యాగం మరువలేనిదని చెప్పారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన ఆయన స్ఫూర్తి నేటికీ ఆదర్శమన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ ముగింపు సభలో సినీ నటుడు నారాయణమూర్తి, మాజీ ఎంపి జివి.హర్షకుమార్, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, విష్ణుకుమార్‌రాజు, మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎలు బంగారు ఉషారాణి, డాక్టర్ బాబ్జి, కలవకొలను శివ, దిగుపాటి రాజగోపాల్, మాజీ ఎంఎల్‌ఎ అంగర రామ్మోహన్, పాందువ్వ శ్రీనివాస్, చైతన్యరాజు, శివాజీ రాజు, కబర్ది, చేగొండి ప్రకాష్, మున్నీ పాల్గొన్నారు.

వినియోగదారులను చైతన్యపర్చేందుకు చర్యలు

జిల్లా ఆసరా అధ్యక్షులు సురేష్‌బాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాట్లాడుతున్న కొడాలి సురేష్‌బాబు

వినియోగదారుడు కొనుగోలు చేసిన వస్తువు నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర ప్రమాణం సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రతిఒక్కరికీ ఉందని జిల్లా ఆసరా అధ్యక్షులు కొడాలి సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఆంగ్లో ఇండియన్ స్కూలులో పశ్చిమగోదావరి జిల్లా ఆసరా వినియోగదారుల సంఘం సమావేశాన్ని కొడాలి సురేష్ బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా ద్వారా వినియోగదారులను చైతన్యం చేసేందుకు వివిధ మాధ్యమాలను, ప్రచార సాధనాలను వినియోగించుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు కొడాలి సురేష్‌బాబు చెప్పారు. వినియోగదారుల్ని చైతన్య పరచడమే కమిటీ ప్రధాన ఉద్దేశమని ఆయన చెప్పారు. వస్తువుల కొనుగోలులో జరిగే మోసాలు, ఆన్‌లైన్‌లో జరిగే మోసాలను అరికట్టేందుకు 2019లో కఠిన చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఏ ఒక్క వినియోగదారుడు మోసపోకుండా ఉండేందుకు చట్టాన్ని సవరించినట్లు చెప్పారు. వినియోగదారులందరూ నిత్యం మార్కెట్లో జరిగే మోసాలు అరికట్టేందుకు పూర్తిస్థాయిలో అవగాహన పొందాలని ఇందు నిమిత్తం కమిటీ పూర్తి స్థాయిలో తమ వంతు సహకారం అందిస్తుందని కొడాలి సురేష్ బాబు చెప్పారు. జిల్లా ఆసరా ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారుడికి ఎటువంటి నష్టం కలిగిన కన్జ్యూమర్ కోర్టు ద్వారా న్యాయం పొందవచ్చని, ఇప్పటికే అనేక కేసులు కన్జ్యూమర్ కోర్టు ద్వారా విజయవంతంగా జరిగాయని చెప్పారు. ప్రతి వినియోగదారుడు మార్కెట్‌లో జరిగే మోసాలపై నిఘా వేసి నష్టం కలిగిన వినియోగదారుడు వెంటనే కన్జ్యూమర్ కోర్టును ఆశ్రయించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసరా జిల్లా సభ్యులు ఎస్.సత్తిబాబు, ఎస్.నాగశేషు, డి.నాగమోహన్, జి.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీమాల శ్రీరామమూర్తి

ఆక్వా ట్రేడర్స్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆక్వా వ్యాపారంలో ట్రేడర్స్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆక్వా ట్రేడర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బీమాల శ్రీరామమూర్తి కోరారు. స్థానిక చంద్రిక ఫంక్షన్ హాలులో ఆక్వా ట్రేడర్స్ నూతన కార్యవర్గం ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఆరో తేదీన విజయవాడలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాలకు చెందిన ట్రేడర్స్‌కు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఇటీవల ఆక్వా రంగం సంక్షోభంలో ఉందని దీంతో, రైతులతో పాటు, ట్రేడర్స్, ఎగుమతి దారులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ట్రేడర్స్ రొయ్యల సరఫరాకు అధిక వడ్డీలకు సొమ్మును తీసుకొచ్చి రైతుకు చెరువు దగ్గరే నగదు చెల్లిస్తున్నారన్నారు. అయితే కంపెనీలకు సరుకును పంపించిన నెల రోజుల నుంచి మూడు నెలల వరకు బిల్లులు కంపెనీలు చెల్లించలేదని, దీంతో రూ.కోట్లలో అప్పుల పాలవుతున్నారన్నారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల్లో బొంబాయి, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉన్న కంపెనీలకు సరుకు సరఫరా చేస్తే సంవత్సరాల తరబడి బిల్లు రావట్లేదని ప్రభుత్వం ఇటువంటి సమస్యలు పరిశీలించాలని కోరారు. ఎగుమతిదారుడికి కల్పించిన సరుకు ఇన్సూరెన్స్ అవకాశాన్ని ట్రేడర్స్ కూడా ప్రభుత్వం కల్పించాలని వారు కోరారు. ఈ సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షులు మట్టా నాగబాబు, కోశాధికారి, కామన రాంబాబు, సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారుడు తోట భోగయ్య పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని బుచ్చులపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

కుమార్తె కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకోడేరు

కుమార్తె కనిపించడంలేదని తల్లి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లలకోడేరు గ్రామానికి చెందిన బి.అశ్రిత కనిపించడం లేదని ఆమె తల్లి గీతాకుమారి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిదో తేదీ రాత్రి ఏడు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన అశ్రిత తిరిగి ఇంటికి రాలేదని, కె.బాలవంశీకుమార్ అనే యువకుడు ఇందుకు కారణమై ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొనట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మొగల్తూరులో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం

మరమ్మతులకు గురైన డ్రెయిన్
రహదారిపైకి చేరుతున్న మురుగునీరు
ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు

మొగల్తూరులో రహదారిపైకి చేరిన డ్రెయినేజీ నీరు

ప్రజాశక్తి - మొగల్తూరు

డ్రెయినేజీ మరమ్మతులకు తవ్వి వదిలేసిన గొయ్యి

మొగల్తూరులో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో మురుగు డ్రెయిన్ సక్రమంగా నిర్వహించడంలేదు. సినిమా హాలు ప్రాంతం నుంచి మసీద్ సెంటర్ ప్రాంతం గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా కొనాయికోడి వరకు గతంలో భూగర్భ డ్రెయిన్‌ను ఏర్పాటుచేశారు. ఈ డ్రెయిన్ మరమ్మతులకు గురైంది. పలుచోట్ల ధ్వంసమై మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. కొన్నిచోట్ల మరమ్మతులు చేసేందుకు పంచాయతీ సిబ్బంది గుంతలు తవ్వారు. నెల రోజులు కావస్తున్నా పనులు చేయకుండా అలాగే వదిలేశారు. పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మసీదు ప్రాంతం తదితర చోట్ల డ్రెయినేజీ నుంచి మురుగునీరు రహదారిపై పారుతుంది. వాహన చోదకులు, సమీప ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దుర్వాసన వెదజల్లడంతోపాటు అంటురోగాలు ప్రబలుతాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. డ్రెయినేజీ మరమ్మతులు చేయించి మురుగునీరు రహదారిపైకి రాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను ప్రజాశక్తి పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి జయరాజు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

లయన్స్ సేవలను విస్తృతం చేస్తాం

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - ఉండి



ప్రమాణస్వీకారం చేసిన లయన్స్ నూతన కార్యవర్గ సభ్యులు

లయన్స్ క్లబ్ సేవలను మండలంలో విస్తృతం చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. ఆదివారం ఉండి రాజులపేటలోని లయన్స్ ఆడిటోరియంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రస్తుత అధ్యక్షులు గొట్టుముక్కల రాము అధ్యక్షతన నిర్వహించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ సేవల్లోనే సంతృప్తి ఉంటుందన్నారు. తమకు సామాజిక సేవ చేయడానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించిన ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్, లయన్ సాగిరాజు సాంబశివరాజు, కోశాధికారి సాగిరాజు సూర్యకుమారి దంపతులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజే సమాజ సేవ చేయడానికి తమకు లయన్స్ క్లబ్ సభ్యులు రూ.లక్షా 70 వేలు సహాయం అందించడంతో ప్రతి పైసా సద్వినియోగం చేసి లయన్స్ సేవలను విస్తృతం చేస్తామని, ఉండి లయన్స్ క్లబ్‌ను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ, మేకా శ్రీరామ సురేష్, జిల్లా వైస్ గవర్నర్ కాకరాల వేణుబాబు, రీజియన్ ఛైర్మన్ దాట్ల రామరాజు, జోనల్ ఛైర్మన్ కె.సత్యనారాయణమూర్తి, జోన్ ఛైర్మన్ రంగారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ ద్వారంపూడి నారాయణరెడ్డి, ఉండి లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కొడమంచిలిలో సత్యసుధామకు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఆచంట



సత్యసుధామను సన్మానిస్తున్న ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇందిరా సీతారామ్

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన కొడ మంచిలి పెదపేటకు చెందిన జిల్లెళ్ల సత్యసుధామను ఆచంట మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్ ఆధ్వర్యంలో కొడమంచిలి పెదపేట పరిశుద్ధ పేతురు లూథరన్ దేవాలయం ఆవరణలో ఆదివారం సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లెళ్ల సత్యసుధామ మాట్లా డుతూ పుట్టిన ఊరిలో గ్రామస్తులంతా గుర్తుపెట్టుకుని సన్మానించడంపై ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ఎస్‌సి ఎస్‌టి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు. దళిత యువత కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని కోరారు. కమిటీ సభ్యురాలిగా అవకాశం కల్పించిన కలెక్టర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, దళితుల సమస్యలను అధికారులకు తెలియజేసి పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆమె పెదపేటకు చెందిన ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, సంఘ పెద్దలు యల్లమెల్లి నాగేశ్వరరావు, మానుకొండ ఏసు, పుచ్చకాయల రమేష్, కోట సతీష్, కుసుమ ధర్మంగాధరావు, నిమ్మితి వేణుబాబు, చెల్లా సుభాకార్, కొట బాబురావు, కోటే శశి మధు, స్త్రీల సమాజం సభ్యులు కేతా సత్యాకుమారి, యూత్ నాయకులు పాల్గున్నారు.

'చేనేత వ్యాపారులపై దాడి దారుణం'

ప్రజాశక్తి - పెనుమంట్ర

ధర్మవరంలో చేనేత కుల వ్యాపారులపై విజయవాడ ఆలయ సిల్క్ యజమాని దాడి చేయడం దారుణమని మార్టేరుకు చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షులు అల్లాడ సూర్యభాస్కర్‌రావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంతోకాలంగా ధర్మవరం చేనేత కార్మికుల దగ్గర, వ్యాపారుల దగ్గర చీరలు అప్పుగా తీసుకుని అప్పు అడిగినందుకు వారిపైన దాడి చేయించడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒపిఎస్‌ను అమలు చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక లూథరన్ హైస్కూలులో అధ్యక్షులు ఐ.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకొచ్చిన వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. సిపిఎస్ రద్దు కోసం హామీ ఇవ్వని రాజస్థాన్, పంజాబ్, చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోగా సిపిఎస్‌ను రద్దు చేస్తానని చెప్పిన జగన్ సిపిస్‌ను రద్దు చేయకపోవడం అన్యాయమన్నారు. బకాయిగా ఉన్న డిఎలను వెంటనే చెల్లించాలని, పిఎఫ్ లోన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రమోషన్ ద్వారా ఖాళీ అయిన ఉపాధ్యాయ పోస్టులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు ఏసేపు, పీటర్, నాగేశ్వరరావు, నరేంద్ర, కార్యదర్శులు విజయ్ కుమార్, రాంబాబు, శాంతకుమారి, సుగుణ, జ్యోతి, వాణి, పద్మిని, సభ్యులు పాల్గొన్నారు. భీమవరం మండల గౌరవ అధ్యక్షురాలిగా వి.శాంత కుమారి, అధ్యక్షులుగా ఐ.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా టి.నాగేశ్వరరావు, వి.నరేంద్ర, ఎం.వాణి, ప్రధాన కార్యదర్శిగా పి.పీటర్, కార్యదర్శులుగా జివై.విజయ్‌కుమార్, టి.ఏసేబు, కె.సుగుణ ఎన్నికయ్యారు.

'శ్రేష్ట'లో పెదతాడేపల్లి గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆర్.విశ్వనాథ్

పెదతాడేపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు శ్రేష్ట ప్రవేశ పరీక్షలో 75 సీట్లు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు ఆదివారం ఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి విద్యారుల్లో ప్రతిభను గుర్తించి ప్రయివేట్ పాఠశాలల్లో సీట్లు కల్పించి చదివించే నదుపాయం ఏర్పాటు చేయడం శ్రేష్ట ముఖ్య ఉద్దేశన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎన్‌పవర్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కీమ్ ఫర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషన్ ఎస్‌సి స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్ టార్గెటెడ్ ఏరియా (శ్రేష్ట) ఈ ప్రవేశ పరీక్షకు గురుకుల పాఠశాల నుంచి 104 మంది విద్యార్థులు హాజరవ్వగా అందరూ అర్హత సాధించారన్నారు. దీనిలో మూడు వేల లోపు ర్యాంకు వచ్చిన వారికి సీట్లు లభిస్తాయన్నారు. దీనిలో భాగంగా ఎనిమిదో తరగతికి చెందిన కత్తుల రిచర్డ్‌సన్ జైన్ ఆల్ ఇండియా లెవల్‌లో 431వ ర్యాంక్, ఆర్.విశ్వనాథ్ 605వ ర్యాంక్, ఎన్‌ఎం.వినయ్ 635వ ర్యాంక్ సాధించగా పదో తరగతికి చెందిన విద్యార్థి వై.దన్వంత్ 615 వ ర్యాంక్ సాధించారన్నారు. 75 సీట్లు సాధించిన వి ద్యార్థులందరికీ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమి ళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, కేరళ, చత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లోని ప్రయివేట్ పాఠశాలల్లో సీట్లు లభిస్తాయని ప్రిన్సిపల్ తెలిపారు. అత్యంత ప్రతిభ కనపరచిన విద్యార్థులను డిఇఒ ఎన్.భారతి, ప్రిన్సిపల్ రాజారావు, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

బడుగు, బలహీనవర్గాలు రాజ్యాధికారం చేపట్టాలి

మాజీ ఎంపీ జోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

రాజ్యాధికారం అంటే రాష్ట్రాధికారం, పది మంది, 20 మంది ఎంఎల్‌ఎలను దక్కించుకోవటం కాదని, ముఖ్యమంత్రి పదవి దక్కించుకోవటం అని మాజీ ఎంపీ చేగొండి హరరామ జోగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ రాజకీయ పార్టీకి, ఏ కులానికి గాని, కొన్ని కులాల సమ్మోహనానికి గాని వారి రాష్ట్రాధికారం దక్కించుకోవడాన్నే రాజ్యాధికారం అంటారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఎక్కువమంది, ఎక్కువకాలం ఈ రాష్ట్రాన్ని రెండే రెండు అగ్ర కులస్తులే పరిపాలన సాగించి ముఖ్యమంత్రులయ్యారని తెలిపారు. ఈ రాష్ట్రంలో మెజారిటీ కులస్తులైన బిసిలు, కాపులు, దళితులు, మైనార్టీలు ఒక దామోదరం సంజీవయ్య మినహా ఏనాడు రాష్ట్ర పరిపాలన చేపట్టలేకపోయారని తెలిపారు. మెజారిటీ జనాభా కల్గిన ఈ కులాలకు మంత్రిపదవులు, శాసనసభ పదవులు వంటి తాయిలాలు ఎర వేసి వారు రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందుతూ వచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 80 శాతం జనాభా కల్గిన బిసిలు, కాపులు, ఎస్‌సి, ఎస్‌టిలు, మైనారిటీలు ఐకమత్యంగా ఉంటే, 20 శాతం ఉన్న అగ్రవర్ణాల ఆధిపత్యంపై రాజకీయ పోరాటం సాగించగలిగినప్పుడే రాష్ట్ర పరిపాలన చేజిక్కించుకోగలుగుతారని తెలిపారు. బడుగు బలహీనవర్గాలను కలుపుకుని రాజ్యాధికారం వైపు పరుగెడుతున్న పవన్‌కళ్యాన్, ఈ మధ్య భీమవరంలో బిసి, శెట్టిబలిజ, గౌడ కులస్తుల ఆత్మీయ సమావేశంలో బిసిలకు, దళితులకు ఒక పిలుపునిచ్చారని, కొంతకాలం కాపులు, మరికొంతకాలం బిసిలు, దళితులు, అంచెలంచెలుగా వంతులవారీగా ముఖ్యమంత్రి పదవులు చేబడదామని ప్రకటించిన ఆయన విధి విధానాలు గమనిస్తే రానున్న రోజుల్లో రాష్ట్రానికి మంచిరోజులు రాబోతున్నాయని విశ్లేషించవచ్చని తెలిపారు.

అభ్యంతరకర వ్యాఖ్యలు తగవు : టిడిపి

ప్రజాశక్తి - ఉండి

వైసిపి నేతలకు సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు తగవని తెలుగు యువత ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలకు ఉండి కోండ్రోతుపేటలోని రోడ్లు, డ్రెయినేజీలు నీట మునిగి చెరువుల్లాగా దర్శనమిస్తున్నాయని, అటువైపుగా ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అంటువ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో అనారోగ్య పాలవుతున్నామని స్థానికులు నాలుగేళ్లుగా అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్న ఫలితం లేకపోయిందన్నారు.. ఈ విషయమై స్థానికులు ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు తక్ష్మిష్టికి సమస్యను తీసుకెళ్లారన్నారు. స్పందించిన ఎంఎల్‌ఎ రామరాజు ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడారని తెలిపారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి అని చెప్పుకునే బడుగు బాలాజీ సోషల్ మీడియాలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజుపై, టిడిపిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడమే కాకుండా ఎంఎల్‌ఎ వచ్చారు కాబట్టి రోడ్డు పున:నిర్మాణ పనులు ఆగిపోయేటట్లు ఉన్నాయని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రజలకు చేసేది గోరంత ప్రచారం కొండంత అన్న రీతిలో వైసిపి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. గత ప్రభుత్వంలో నిత్యావసర ధరలు, నిరుద్యోగ సమస్య, విద్యుత్ ధరలు అన్ని నియంత్రణలోనే ఉండేవన్నారు. కాని నేడు ఈ సమస్యలను పరిష్కరించడంలో వైసిపి పూర్తిగా విఫలమైందన్నారు. వైసిపిలో జిల్లా కమిటీ పదవులను సంవత్సరం క్రితమే రద్దు చేయగా తనను పార్టీ పెద్దలు ఎవరు గుర్తించట్లేదనే ఉద్దేశంతో జిల్లా అధికార ప్రతినిధి అని చెప్పుకొని నిత్యం వార్తల్లో ఉండే విధంగా బడుగు బాలాజీ ప్రయత్నిస్తున్నారన్నారు. ఉండి గ్రామంలోని సిమెంట్ రోడ్లను, డ్రెయినేజీలను 90 శాతం గత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హరినాయుడు తెలిపారు.



శ్రీనివాస్‌కు మందులు అందిస్తున్న సుధాకర్

పాలకొల్లు వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

నిస్సాహయులను ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వాకర్స్ క్లబ్, పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పాలకొల్లు కొత్త కుళాయి చెరువు వద్ద క్లబ్ తరపున వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాలకొల్లు పెదగోపురం గోశాలలో పనిచేస్తున్న కుంపట్ల శ్రీనివాస్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో అతనికి రూ.పది వేలు విలువైన మందులు అందించారు. ఇద్దరు పేద విద్యార్థులకు రూ.తొమ్మిది వేల విలువైన పుస్తకాలు, రెండేళ్ల బాలుడు లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుని వైద్యం నిమిత్తం అతని తల్లిదండ్రులకు రూ.ఆరు వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, సలాది రామచంద్రరావు, సోమంచి శ్రీనివాస శాస్త్రి, కారుమూరి రామలింగేశ్వరరావు, ఎస్‌పి.గుప్త, వాకర్ సభ్యులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ రాగి జావ, డ్రై ఫ్రూట్లు పంపిణీ చేశారు.

12న విజయవాడలో రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 12వ తేదీన విజయవాడలో నిర్వహించే భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు నాయకులు దాన వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మోదుగుగుంటలో ఆదివారం కార్మికుల సమక్షంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుందేటి శ్రీనివాస్, పామర్తి జాన్, కె.పోసంద్రప్రసాద్, బి.భాస్కరరావు, నాగుల అంజయ్యాదాసరి, జాన్, సిహెచ్.వెంకన్న, ఎం.నరసింహరావు, వీరబాబు పాల్గొన్నారు.

11 నుంచి ప్రపంచ జనాభా దినోత్సవ వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 11వ తేదీ నుంచి 17 వరకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను జెపి రోడ్డులోని ఇండియన్ ఆసుపత్రిలో ఆదివారం డాక్టర్ ఎం.జగదీశ్వరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ఒక్క దేశ ప్రగతి, అభ్యున్నతి ఆ దేశ జనాభాపై ఆధారపడి ఉంటుందన్నారు. దినోత్సవాన్ని వారోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 11న డాక్టర్ సిఎస్ఎన్ కళాశాలలో ప్రారంభోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ వైద్య అధికారులు, ఐఎంఎ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు మండలాల పరిధిలో విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తామని, 17న జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు కెవి.కృష్ణారావు, ఆక్వా రవి, గంటా సుందర కుమార్ పాల్గొన్నారు.

మావుళ్లమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని 20వ వార్డులోని అమ్మవారి పూరిగుడిసె వద్ద, 3వ వార్డు బుధవారం మార్కెట్‌లో శ్రీమావుళ్లమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న జాతర మహోత్సవాన్ని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. గత 35 ఏళ్లుగా సంప్రదాయ బద్ధంగా అమ్మవారి జాతర మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత అన్నదాత పవన్‌రాజ్, వరలక్ష్మి, నాళం రాజశేఖర్, లక్ష్మీపవని దంపతులతో ప్రతేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, డప్పుల వాయిద్యాలు, శక్తి వేశధారణలు, గరగల నృత్యాలతో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, మెంటే బలరాం, గోపిశెట్టి సుబ్బారావు, సమితి సభ్యులు శ్రీరామలింగం, అయిశెట్టి లక్ష్మణమూర్తి, శివ, శ్రీసైలపు నాగబాబు, కందుకూరి గుప్తా, గోగుల సోమేశ్వరరావు, అక్కింతల సురేష్ పాల్గొన్నారు.

వారాహి యాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాడేపల్లిగూడెం పర్యటనను విజయవంతం చేసేందుకు జనసైనికులు కలిసికట్టుగా పనిచేయాలని జనసేన మండల అధ్యక్షులు ఆడపా ప్రసాద్ కోరారు. కడియద్దలో వారాహియాత్ర సందర్భంగా ఆదివారం జనసైనికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాహి యాత్ర సందర్భంగా తాడేపల్లిగూడెం విచ్చేస్తున్న పవన్ కల్యాణ్ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైలవరపు రాజేంద్రప్రసాద్, సోమా శంకరం, కసిరెడ్డి మధులత, గరగ విష్ణుప్రియ, మట్టా రామకృష్ణ, భత్తిరెడ్డి రత్తయ్య, కళ్లెం రాజేంద్ర, పీతల బుచ్చిబాబు, కోటా శ్రీరామ్, దార్లంకట్ రాము, కామిశెట్టి శ్రీనివాస్, కర్రీ వెంకట సోమునాయుడు, పల్లంట్ల సతీష్, సాల్మన్ రాజు, అరెగిల కృష్ణ, ఆనందరాజు, కడియద్ద నాయకులు కుంచె గంగరావు, కొండపల్లి కేదారిసు పాల్గొన్నారు.